క్లుప్తంగా

యూరియా కోసం బారులు



మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: మండల వ్యాప్తంగా **యూరియా** కొరత వేధిస్తూనే ఉంది. వచ్చే **అరకొర** యూరియా కోసం రైతులు అవస్థలు **పడుతు** న్నారు. ఖరీఫ్ వరి సాగు దాదాపుగా **పూర్తి** స్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో **యూరియా** కోసం రైతులు రైతు సేవా కేంద్రాల వైపు పరుగులు తీస్తున్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 9 గంటలకే రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. ప్రతి రైతుకు బస్తా వంతున యూరియాను అందజేశారు. సీజన్‌కు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే విజయ కుమార్ అన్నారు. నాగులాపల్లిలో శుక్రవారం ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ప్రతి రేషన్ డిపో ద్వారా పలు రకాల నిత్యావసర సరకులు అందజేస్తామన్నారు. పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, దొడ్డి శ్రీనివాసరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్ పాల్గొన్నారు.

నక్కపల్లి ఆస్పత్రికి డెంటల్ సర్జన్ నియామకం



డాక్టర్ సునీల్ సురేష్ రాజు

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రికి డెంటల్ సర్జన్ నియమితులయ్యారు. కె.కోటపాడు ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వై.సునీల్ సురేష్ రాజును ప్రభుత్వం నక్కపల్లి ఆస్పత్రికి బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. దంత రోగాలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తానని సురేష్ రాజు తెలిపారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ సూచించారు. చిన్న చిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా అర్జీదారులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తగాదాలకు పాల్పడకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్‌ఐ పి.ప్రసాదరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలి



యండపల్లిలో మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటవురట్ల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని డీడీవో నాగలక్ష్మి సూచించారు. యండపల్లి గ్రామంలో ఆమె శనివారం పర్యటించారు. వీధుల్లో పారిశుధ్యం పరిశీలించి ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.


పైడమ్మ చెరువుకు ఫెన్సింగ్ వేయొద్దు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న వాడనర్సాపురం వాసులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో వాడనర్సాపురానికి ఆనుకొని ఉన్న పైడమ్మ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ప్రయత్నిస్తున్న ఎన్ఏవోబీ చర్యలను అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఉదయం ఆయన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు. నేవల్ బేస్ గేట్‌కు ముందు పైడమ్మ చెరువుకు ఆనుకొని తమ గ్రామం ఉందని, ఇదే చెరువుపై పలు గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబీకులు ఆధారపడి జీవిస్తున్నారని వారు వివరించారు. ఇప్పటికే సముద్రంతోపాటు శారదా నదిలో చేపల వేట ఆంక్షలకు గురవుతున్న తమకు పైడమ్మ చెరువు చివరి ఆధారమని వాపోయారు. దాని నుంచి దూరం చేస్తే జీవనోపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. ఎన్ఏవోబీ ప్రభావిత వాడనర్సాపురాన్ని తరలించాల్సి వస్తే, అప్పుడు చెరువు చుట్టూ ఫెన్సింగ్‌కు అనుమతివ్వాలని స్పష్టం చేశారు. గ్రామం ఇక్కడున్నంత కాలం చెరువు తమ అధీనంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పొదుగు వాపు వ్యాధితో జాగ్రత్త



• అపరిశుభ్రతతోనే వ్యాధి సంక్రమణ • లక్షణాలు కనిపించగానే చికిత్స అవసరం • పశు సంవర్థక శాఖ ఏడీ లక్ష్మీనారాయణ

కోటవురట్ల : పాడి అన్నదాతకు కొండంత ఆసరాగా ఉంటోంది. ఇంట్లో అవసరాలతో పాటు పిల్లల విద్యాభ్యాసం కూడా పాడి ఆసరాతోనే ఎంతో భరోసా వస్తోంది. రైతును ఆదుకుంటున్న పాడి పట్ల అశ్రద్ధ వహిస్తే నష్టాలతో పాటు ఇబ్బందులూ తప్పవు. రైతుకు పాడి పశువుల ఎంపిక నుంచి సంరక్షణ, సీజనల్ వ్యాధులు, వాటి నివారణ, ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వంటి అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఉండాల్సిందే. పాడి పశువులపై దాడి చేసే అనేక వ్యాధుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ప్రధానంగా పాడి పశువుల్లో వచ్చే పొదుగు వాపు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు బి.ఎస్.వి.లక్ష్మీనారాయణ సూచిస్తున్నారు. పాడి పశువుల్లో వచ్చే అనేక వ్యాధుల్లో ఒకటైన పొదుగు వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఈ సందర్భంగా పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న పశువులు, సంకరజాతి పశువుల్లో పొదుగు వాపు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ వ్యాధికి కాలం అంటూ ఏదీ ఉండదని, పాలు ఇచ్చే పశువుల్లో ఏ సమయంలో అయినా వచ్చే అవకాశం ఉందన్నారు.

ఎలా వస్తుంది?..

పాలు పితికేటప్పుడు గోళ్లు తగిలి పుండ్లు పడడం వల్ల, దూడ పాలు తాగేటప్పుడు ఏర్పడ్డ గాయాలు పుండ్లుగా మారి సూక్ష్మజీవులు పొదుగులోకి ప్రవేశించి వ్యాధి సంక్రమిస్తుంది. పొదుగుకు చిన్న గాయమైనా వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మురికిగా ఉన్న చేతులతో పాలు పితికినా వ్యాధి వస్తుంది.

లక్షణాలు ఏంటి?

వ్యాధి బారిన పడిన ఆవులు, గేదెల పొదుగు, చన్నులు వాచిపోతాయి. పొదుగు, చన్నులు వేడిగా ఉండి ముట్టుకోగానే పశువులు బాధతో విలవిల్లాడిపోతాయి. పొదుగు గట్టిగా మారిపోతుంది. ఈ వ్యాధి ఒక చన్నుకు గాని అంతకంటే ఎక్కువ వాటికి గాని వచ్చే అవకాశం ఉంది. పాలు పితికినప్పుడు నీరులా ఉండి తక్కువ పాలను మాత్రమే ఇస్తుంది. ఒక్కొక్కసారి పాలధారలో రక్తపు బొట్లు వస్తాయి. జ్వరం సోకడంతో మేత తగ్గిపోయి నీరసించిపోతుంది.

వ్యాధిని నివారించడం ఎలా?

పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీలైనంత పొడిగా ఉండేలా చూసుకోవాలి. పశువులను శుభ్రంగా కడుగుతూ ఉండాలి. పాలు పితికే ముందు గోరువెచ్చని నీళ్లతో పొదుగును కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవాలి. పాలు పితికేవారి చేతులకు గోళ్లు **లేకుండా జాగ్రత్త పడాలి. పొదుగులో పాలు ఉంచకుండా మొత్తం పితికేయాలి.** గర్భ కోశ వ్యాధి **ఉన్న పశువులు, ఈనిన పశువులకు** చెందిన మానం నుంచి కారే రక్తం, చీము, స్రవాలను పొదుగుకు తాకకుండా ఎప్పటికప్పుడు గోరు వెచ్చటి నీటితో శుభ్రపరుస్తూ ఉండాలి.

చికిత్స ఇలా..

ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులకు యాంటిబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పశువుకు వ్యాధి, రైతుకు నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. రైతులు ఎప్పటికప్పుడు పశువులను పరిశీలిస్తూ కొత్తగా ఏమైనా మార్పులు కనిపించినా, వ్యాధి లక్షణాలు తెలిసినా వెంటనే చికిత్స చేయించాలి. అనుమానం ఉంటే పశువైద్యులకు వివరించి తగిన సలహాలు తీసుకోవా లని పశు సంవర్ధక శాఖ ఏడీ చెప్పారు. సకాలంలో వ్యాధులను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయడం, చికిత్స అందించడం ద్వారా ఫలితం ఉంటుందని వివరించారు.

పెదరాంభద్రపురం ఉపాధ్యాయుల ఔదార్యం



ఐడీ కార్డులు, బ్యాడ్జ్ ధరించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు



స్పోర్ట్స్ దుస్తులతో విద్యార్థులు

పాయకరావుపేట: పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తమ సేవా భావంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు తోటి ఉపాధ్యాయుల సహకారంతో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు, విద్యార్థుల్లో పోటీతత్వం నింపేందుకు విశేష కృషి చేస్తున్నారు. కార్పొరేట్ హంగులు, సౌకర్యాలను సమకూరుస్తూ విద్యార్థుల్లో ఆత్మ న్యూనతాభావాన్ని పోగొడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా పెదరాంభద్రపురం విద్యార్థులకు గుర్తింపు కార్డ్స్, స్పోర్ట్స్ డ్రెస్‌లు, పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి పతకాలు అందజేస్తూ పోటీతత్వం నింపుతున్నారు. ఇందులో భాగంగా వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ రెహమాన్ సుమారు రూ.20 వేలు సమాకూర్చి 40 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు విద్యార్థులకు బ్యాడ్జీలు, ఐడీ కార్డ్‌లు సమకూర్చారు. ఉన్నతమైన వ్యక్తుల పేర్లతో వివిధ రకాల కార్యక్రమాల కోసం హౌస్‌లు ఏర్పాటు చేయడం, పర్యావరణం పట్ల బాధ్యత కలిగేలా విద్యార్థులతో ఏటా మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయించి బహుమతులు అందజేస్తున్నారు. తమ పిల్లలకు ఉపాధ్యాయులు సమకూర్చిన సౌకర్యాలపై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లో చేరిన కార్యదర్శులు



ఎంపీడీవో చంద్రశేఖర్ సమక్షంలో విధుల్లో చేరుతున్న కార్యదర్శులు

కోటవురట్ల: మండలంలో నలుగురు కార్యదర్శులు బదిలీపై వచ్చిన శనివారం విధుల్లో చేరారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌ను కలిసి ఉత్తర్వులను అందజేసి బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో మాట్లాడుతూ రామచంద్రపాలెం, లింగాపురం, టి.జగ్గంపేట, చినబొడ్డేపల్లి గ్రామాలకు కార్యదర్శులుగా సిహెచ్.రమణ, జి.సౌజన్య, డి.శ్రీరామరాజు, ఎల్.ముత్తయ్యనాయుడు చేరినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని కార్యదర్శులకు సూచించారు.

అచ్చెన్న చెరువులో మట్టి తవ్వకాలపై నిలదీత



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ లాలం రాము

అచ్యుతాపురం రూరల్ : యర్రవరం గ్రామం సర్వే నంబర్ 147లోని అచ్చెన్న చెరువులో మట్టి తవ్వకాలకు ఎలా అనుమతులు ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాము ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇటీవల యర్రవరం గ్రామంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ చెరువు మట్టి అక్రమంగా తరలించుకుపోతున్నారని గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై ఆయన అధికారులను నిలదీశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీవో కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ కోన సంధ్య, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీడీవో బి.చిన్నారావు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజల సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య మాట్లాడుతూ మోసయ్యపేటలో మలేరియా, పూడిమడకలో డెంగ్యూ కేసులు నమోదైనట్లు చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దివ్యాంగులు పింఛన్ పొందేందుకు తప్పనిసరిగా కేజీహెచ్‌లో మెడికల్ బోర్డ్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే తిరిగి ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గొడిచర్లలో పారిశుధ్య పనుల పరిశీలన



గొడిచర్లలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు, తదితరులు

నక్కపల్లి: గొడిచర్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో సీతారామరాజు శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల సహాయంతో ఇంటింటికి వెళ్లి శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను సేకరించే పనులు పరిశీలించారు. సాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఉదయం మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఇళ్ల వద్ద చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ వేరు చేసి వర్మీ కంపోస్టు తయారీ కోసం వినియోగించాలన్నారు. శానిటేషన్ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవానీ దీక్షలు ప్రారంభం



దీక్షలు చేపడుతున్న భక్తులు

నక్కపల్లి: శరన్నవరాత్రులు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో భవానీ దీక్షలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. తొమ్మిది రోజుల దీక్షలతో పాటు, మండల, అర్ధ మండల దీక్షలు చేపడతారు. ఇందులో భాగంగా ఉపమాక శివాలయం, దుర్గాదేవి ఆలయాల్లోను, ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయాల్లో భక్తులు దీక్షను స్వీకరించారు. నక్కపల్లి, ఉపమాక, పాలెం, దేవవరం, ఒడ్డిమెట్ట, గొడిచర్ల, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, సారిపల్లిపాలెం, చీనదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో భక్తులు భవానీ దీక్షలు చేపట్టి గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో పీఠాలు ఏర్పాటు చేసుకుని అమ్మ వారికి పూజలు చేస్తున్నారు. ఉపమాక పరిసర ప్రాంతాల భక్తులకు శుక్రవారం అఖిల భారత భవానీ దీక్షా సంఘం ప్రతినిధి, గురుభవానీ దవర శింగురాంబాగు గురుస్వామి మాలలు వేశారు. పాటించాల్సిన నియమ, నిబంధనలు తెలియజేశారు.

200 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ ఉద్యోగులు

పాయకరావుపేట: తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం శుక్రవారం డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మదర్ బ్లడ్ బ్యాంకు, వైఎస్సార్ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో కంపెనీ ఉద్యోగస్తులు సుమారు 200 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ కె.వి.ఎల్.పి.రాజు, వైస్ ప్రెసిడెంట్ అండ్ హెచ్‌ఆర్ పి.వి.ఎస్.ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐకి డెక్కన్ సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న డెక్కన్ డైరెక్టర్ రాజు

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రానికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని డెక్కన్ ఫైన్ కెమికల్స్ డైరెక్టర్ కె.వి.ఎల్.పి.రాజు అన్నారు. డెక్కన్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.3 లక్షలు వెచ్చించి డ్రిల్లింగ్ మెషిన్, కటింగ్ మెషిన్, హెచ్‌పీ లేజర్ ప్రింటర్, 6 కేవీఏ యూపీఎస్ బ్యాటరీ, తదితర సామగ్రి కొనుగోలు చేసి ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కేంద్రానికి అవసరమైన సహకారం అందించడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి, శిక్షణా శాఖ ఆర్‌డీడీ ఆర్.వి.రమణ, ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, జిల్లా శిక్షణాధికారి వి.ఎస్.ఎన్.మూర్తి, ఎం.లతాదేవి పాల్గొన్నారు.

ఆవ కాలువలో శ్రమదానం



ఆవ కాలువలో తుప్పల తొలగింపు చేస్తున్న రైతులు

మునగపాక: మునగపాక ఆవ కాలువలో తుప్పల తొలగింపు కోసం శుక్రవారం రైతులు శ్రమదానం చేశారు. ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు కాలువలో పలు చోట్ల అడ్డుగా ఉన్న చెట్లు, తుప్పలు తొలగించారు. రైతు సంఘ సభ్యులు శ్రమదానం చేసి తుప్పలు తొలగించడంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది.

నిరసన గళం పెంచిన గురువులు



కోటవురట్ల: తహసీల్దారు తిరుమలబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



మునగపాక: ఆర్ఐ కృష్ణవేణికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



ఎస్.రాయవరం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: గురువులు నిరసన గళం పెంచారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ నిరసన వారం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏపీటీఎఫ్ సభ్యులు రెండో రోజు తహసీల్దారు తిరుమలబాబుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం అందించారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పద్ధతిలోనే పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను అసిస్టెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసు, మండల శాఖ అధ్యక్షుడు సంగీత్‌రాజ్, ప్రధాన కార్యదర్శి లోవరాజు, సీనియర్ నాయకులు కృష్ణ ప్రసాద్, వాసు, సాంబ, జీవన్ పాల్గొన్నారు.

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఆర్ఐ కృష్ణవేణికి ఏపీటీఎఫ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు ఎం.వై.రాము, సీనియర్ ఉపాధ్యాయులు పెంటకోట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.శంకరరావు, జిల్లా కౌన్సిలర్ బి.విజయవాణి, ఉప ప్రధాన కార్యదర్శులు గోవింద్, సూరప్పారావు, సోమశేఖర్, కృపావతి, సృజన తదితరులు నిరసన తెలిపారు.

ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్నచూపు

యలమంచిలి రూరల్: ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, మల్లిపాటి సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యలమంచిలి తహసీల్దార్ వరహాలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కర్రి వీరభద్రరావు, జిల్లా కౌన్సిలర్లు చంద్రశేఖర్, వై.సత్యారావు, జి.సర్వేశ్వర్రావు, సభ్యులు ఎన్‌వీఆర్ఎం కిషోర్, పి.శ్రీనివాసరావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: నిరసన వారంలో భాగంగా రెండో రోజు శుక్రవారం కూడా మండల కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు వ్యక్తిగత రక్షణపై అవగాహన



తిమ్మాపురం పాఠశాలలో బాలికలకు శిక్షణ ఇస్తున్న తైక్వాండో శిక్షకులు

ఎస్.రాయవరం: బాలికలకు సమస్య ఎదురైనప్పుడు వ్యక్తిగత రక్షణపై అవగాహన ఉండాలని ఎస్ఐ విభీషణరావు అన్నారు. స్థానిక తైక్వాండో శిక్షకులు ఎస్.రాయవరం, ధర్మవరం అగ్రహారం, వమ్మవరం, తిమ్మాపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు పరిసరాల్లో సంచరించే వారిపై నిఘా ఉంచి, ప్రవర్తన తెలుసుకోవాలన్నారు.

15న చలో విజయవాడను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): ఈ నెల 15న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చందక రామకృష్ణ పిలుపునిచ్చారు. రాంబిల్లి మండలం వెల్చూరు, పెద కలవలాపల్లిలో శుక్రవారం చలో విజయవాడకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డుని పునరుద్ధరించాలని, పెండింగ్ క్లయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమార్థం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజయవాడలో కమిషనరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్.రాంబాబు, నాగేంద్ర, రాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరికి ఘన నివాళి



సీతారామ్ ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్ : పేద ప్రజల కోసం నిరంతర పోరాటం చేసిన వామపక్ష నేత సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా అచ్యుతాపురంలోని ఆయన చిత్ర పటానికి శుక్రవారం సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భీముని వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, కడారి శంకర్, బెజవాడ శ్రీను, ఆర్.లక్ష్మి, సారిపల్లి శ్రీను, రామారావు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



పారిపల్లెమ్మ ఆలయ సమీపంలో గ్రావెల్ రోడ్డు పనులు

మునగపాక: జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు మండలంలోని వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ తల్లి ఆలయ సమీపంలో వాడ్రాపల్లి నుంచి పాటిపల్లి లింక్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల వాడ్రాపల్లిలో పర్యటించిన విజయ కృష్ణన్ దృష్టికి రైతులు ఈ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆమె రహదారి ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించడంతో శుక్రవారం పనులు ప్రారంభించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.